క్లుప్తంగా

ఫైబర్‌నెట్ బాక్సులు మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు

పూసపాటిరేగ: ఫైబర్‌నెట్ కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు బాక్సులు మంజూరు చేయాలని కేబుల్ ఆపరేటర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరావు కోరారు. సోమవారం స్థానిక రాజావీధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫైబర్‌నెట్ ఆపరేటర్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రసారం నిలిపివేసిన బాక్సులకు కూడా 58 రూపాయలు కట్ అవుతోందని తెలిపారు. ఆపరేటర్లు అశోక్, చిన్న పాల్గొన్నారు.

నిరసన

విజయనగరం టౌన్: ఏఎల్‌టీటీసీ ఘజియాబాద్ బీఎస్ఎన్ఎల్ ట్రైనింగ్ సెంటర్ స్వాధీనంలో ఉన్న 83 ఎకరాల భూమిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (కేంద్ర ప్రభుత్వం) స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు సోమవారం లంచ్ అవర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆలుగు వెంకటరావు, ఆనందకుమార్, భాస్కరరావు, కృష్ణకుమారి తామాడ, నీలిమ, పద్మజ, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

విజయనగరం టౌన్: అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని బొగ్గులదిబ్బ కార్పొరేటర్లు సుంకరి బాబు, బోనెల ధనలక్ష్మి అన్నారు. కార్తీకమాసం నాలుగో సోమవారం సందర్భంగా స్థానిక గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సోమశేఖర్ శర్మ, ఆలయ ఈఓ పద్మావతి, కమిటీ సభ్యులు దుబే, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్/నెల్లిమర్ల రూరల్: ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పూడి హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఉడా సబ్ స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో ఉడా ఫేజ్-1, ఫేజ్- 2, ఫేజ్-3, ఫేజ్ -4, బొబ్బాది పేట, తదితర ప్రాంతాలకు సరఫర ఉండదన్నారు.

నేడు నిలిపివేత..

అలాగే సతివాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో సతివాడ కల్లాలు, మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొడ్డపేట, బొప్పడాం, బుచ్చన్నపేట, వల్లూరు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాజులరేగలో 'వయోవృద్ధులను గౌరవిద్దాం ర్యాలీ'

విజయనగరం అర్బన్: గాజులరేగలో సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 'వయోవృద్ధులను గౌరవిద్దాం' అనే అంశంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, వృద్ధులు ఎదుర్కొనే వివిధ రకాల వేధింపులను గుర్తించి, వాటి పరిష్కారానికి ఆలోచనలు చేయాలని సూచించారు. ర్యాలీలో ఎదురైన వృద్ధులకు మిఠాలు తినిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన భారత్‌గా మార్చాలి..

డెంకాడ: దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్‌గా మార్చాలని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఉద్దేశంతో అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల విద్యార్థులతో 'వికసిత్ భారత్ - 2047' కార్యక్రమంలో భాగంగా సోమవారం వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఈ మేరకు ప్రధాని మోదీ సందేశాన్ని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు తిలకించారు. ఎంవీజీఆర్ డైరెక్టర్ సీతారామరాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, డీన్ ఎస్. మోహన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని సందేశం..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ సందేశాన్ని తిలకించారు. వికసిత్ భారత్ - 2047 వాయిస్ ఆఫ్ యూత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ వర్చువల్ సమావేశంలో ప్రసంగించారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, డీన్ డాక్టర్ సన్నీడియోల్, ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, డీన్ మురళీ, తదితర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


నెల్లిమర్ల రూరల్: ప్రధాని సందేశాన్ని తిలకిస్తున్న సెంచూరియన్ విద్యార్థులు

గరళకంఠుడికి ప్రత్యేక పూజలు


పూసపాటిరేగ: శివాలయంలో మహిళా భక్తుల సందడి


డెంకాడ: ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


విజయనగరం టౌన్: పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్ఫటిక లింగాకారుడు

కార్తీకమాస చివరి సోమవారం కావడంతో గ్రామాలు, పట్టణాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. స్వామి దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయాల్లో శివ నామస్మరణ మార్మోగింది. మహిళా భక్తులు ధ్వజస్తంభాలు, తులసికోటల వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్


విజయనగరం టౌన్: పశుపతి నాథేశ్వర ఆలయంలో రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు


డెంకాడ: ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నగర శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

- కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- 1వ డివిజన్‌లో రూ.6.80 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, తదితరులు

విజయనగరం: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాలలో సైతం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 1వ డివిజన్ పరిధిలో గల రాజవీధి, హనుమాన్ నగర్‌లలో 6.80 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న సీసీ రహదారులు, డ్రైన్‌లకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమస్యల్లేని నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే నగరంలో అనేక ప్రాంతాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని చెప్పారు. ఒకవైపు మౌలిక సదుపాయాలు కల్పించడం, మరోవైపు ప్రజా అవసరాలను గుర్తించి తాగునీరు సరఫరా చేయడం వంటి అనేక చర్యలు ఈ నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను కూడా చేపడుతన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ మాట్లాడుతూ, తమ డివిజన్ ఎంతగానో అభివృద్ధి చెందడానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కారణమన్నారు. గత పాలకుల హయాంలో తమ డివిజన్ నిర్లక్ష్యానికి గురవ్వగా..నేడు కోలగట్ల దయవల్ల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, డివిజన్ ఇన్‌చార్జ్ దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు


విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ,ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: విభిన్నప్రతిభావంతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని, వారికి అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 258 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు, మోటార్ సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, వైకుంఠం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, మండలశాఖ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఎంపీడీఓ జి. రామారావు, తహసీల్దార్ డి. ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స


సతివాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని సతివాడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించామన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు క్షేత్ర స్థాయిలో మంచి సేవలు అందుతున్నాయని చెప్పారు. పంటకు నష్టం ఏర్పడితే పరిహారం, సాగుకు సాయం అందించడంతో పాటు దిగుబడులు కూడా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మేలు


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

డెంకాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల అనేక మందికి మేలు జరుగుతోందని ఎంపీడీఓ స్వరూపారాణి అన్నారు. మండలంలోని సింగవరం, నాతవలస గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయా విభాగాల అధికారులు వివరించారు. కార్యక్రమంలో సింగవరం సర్పంచ్ పిట్టా పద్మావతి, సీడీపీఓ ఎస్తేరురాణి, ఏఈఓ బి.రామకోటి, సీసీ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బమ్మిడి వెంకటరమణ, ప్రవీణ్, శ్రీను, పంచాయతీల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ముసిడిపల్లి, రామతీర్థాలు, నెల్లిమర్ల మాస్టర్ పంప్‌హౌస్ కార్మికులకు 3 నెలల బకాయి జీతాలు.. పారిశుధ్య కార్మికులకు 3 నెలల బకాయి హెల్త్ అలవెన్స్‌లు తక్షణమే చెల్లించాలనీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) విజయనగరం జిల్లా కమిటీ నాయకుడు ఎ. జగన్ మోహనరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సుధారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం డీఆర్‌ఓ అనితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రరావు, రాఘవ, అర్జున్, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలో ఉన్న అన్ని గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డీఆర్‌ఓ అనితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సునీల్, సహాయ కార్యదర్శి బి. రవికుమార్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల పరిశీలన

విజయనగరం రూరల్: మండలంలోని చెల్లూరు గ్రామంలో సుమారు రూ. 50 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవన నిర్మాణాలను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

జగనన్న హయాంలో ప్రజారంజక పాలన


విజయనగరం: నగరంలోని 25వ డివిజన్‌లో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నెల్లిమర్ల : అగురువీధిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని, తదితరులు


పూసపాటిరేగ: వెంపడాంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న అప్పలనాయుడు, తదితరులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోంది. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం వివరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. రానున్న రోజుల్లో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం ఎందుకు అవసరమో ప్రజాప్రతినిధులు వివరిస్తున్నారు. ఇందులో భాగంగా విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్

డెంకేషావలీ బాబా ఆలయ పునర్నిర్మాణంపై రభస


ఇరువర్గాలకు సర్దిచెబుతున్న టూటౌన్ సీఐ విజయానంద్

విజయనగరం క్రైమ్: కోట జంక్షన్ వద్దనున్న డెంకేషావలీ బాబా ఆలయ పునర్నిర్మాణ విషయంలో సోమవారం రభస చోటుచేసుకుంది. ఆలయానికి ఉన్న స్థలం హద్దులు దాటి నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపిస్తూ పనులు అడ్డుకున్నారు. అయితే తాము హద్దులు దాటలేదని దర్గా నిర్వాహకులు స్పష్టం చేశారు. ఇరువర్గాలు వాదులాడుకుంటున్న సమయంలో మున్సిపల్, పోలీస్ అధికారులు చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఆలయానికి ఎంతవరకూ హద్దులున్నాయో మంగళవారం గుర్తిస్తామని, ఆ తర్వాత నిర్మాణం చేపట్టుకోవాలని దర్గా నిర్వాహకులకు సూచించారు. ఇదిలా ఉంటే దర్గా నిర్వాహకుడు షేక్ బహదూర్ మాట్లాడుతూ, ఆలయ పునర్నిర్మాణానికి రెండేళ్ల కిందటే పనులు చేపట్టగా అప్పుడు కొంతమంది అడ్డుకున్నారని.. మళ్లీ ఇప్పుడు బీజేపీ నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. మరోవైపు బీజేపీ నాయకులు ఇమంది సుధీర్, అల్లు రామకృష్ణరాజు, మజ్జి రమేష్, ఆది, తదితరులు మున్సిపల్ కమిషనర్‌ను, జేసీ మయూర్ అశోక్‌ను కలిసి సమస్య వివరించారు.

నిరుపేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- 89 మంది నిరుపేద రైతులకు పట్టాల పంపిణీ


సతివాడలో లబ్ధిదారురాలికి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని సతివాడ గ్రామ సచివాలయంలో 89 మంది నిరుపేద రైతులకు డీ పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి జగనన్న అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఏళ్ల కాలం నుంచి భూములు సాగుచేస్తున్నా, వాటిపై యాజమాన్య హక్కులు లేక రైతులు దిగులు చెందేవారన్నారు. అటువంటి వారందరికీ మేలు చేసేలా సాగు భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. 20 సంవత్సరాల నుంచి డీ పట్టా భూమిలు సాగు చేస్తున్న రైతులందరికీ భూమిపై శాశ్వత హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. ఇకపై ప్రభుత్వం నుంచి పట్టాలు అందుకున్న రైతులందరూ భూములను అమ్ముకోవడం, తాకట్టు పెట్టుకోవడం చేసుకోవచ్చన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా పాలన సాగిస్తూ అర్హులందరికీ మొండిచేయి చూపించారని, నేడు ఆ పరిస్థితి ఎక్కడా లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జమ్ము అప్పలనాయుడు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తహసీల్దార్ ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక


ప్రజావేదికలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన డ్వామా పీడీ జి. ఉమాపరమేశ్వరి, ప్రిసైడింగ్ అధికారి ఎస్. జనార్దనరావు ఆధ్వర్యంలో ఉపాధి పనులపై సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ సభ్యులు మాట్లాడుతూ, 2022 - 23 సంవత్సరానికి గాను జీఏస్, పీఆర్ ఓ, ఆర్‌డబ్ల్యూ పనులకు సంబంధించి రూ.17.19 కోట్లు, మెటీరియల్‌కు 18.39 రూ. కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా వేతనదారుల మస్టర్లలో చిన్న చిన్న పొరపాట్లు చోటు చేసుకున్నాయని.. రోడ్లకు ఇరువైపులా, చెరువు గట్లపై నాటిన మొక్కలు కొన్ని చనిపోయినట్లు గుర్తించారు. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షించాలని ఆదేశించారు. చేసిన పనులకు సంబంధించిన పనుల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, డీవీఓ పి. వెంకటరావు, ఏపీడీలు లక్ష్మణ్, వెంకటనాయుడు, ఎస్ఆర్‌పీ అచ్యుతరావు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఏపీఓ ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో దళితుల భూములు..

- కలెక్టరేట్ వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా


కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న దళితులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రతి మండలంలో దళితుల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, గౌరవాధ్యక్షుడు ఆర్. రాము అన్నారు. దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోతే పోరాటం తప్పదన్నారు. దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలని.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 29 రకాల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని.. డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్ ఐదు వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాముల నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: నగర సుందరీకరణకు విఘాతం కలిగించే వారి పట్ల చర్యలు తప్పవని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు 61 సచివాలయ పరిధిలో ఉన్న ప్రణాళికా కార్యదర్శులతో సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో సుందరీకరణకు విఘాతం కలిగించే వారి పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు గోడలపై పోస్టర్లు అతికించడం, గోడలపై రాతలు రాయడం వంటి చర్యలను నిషేధించినట్లు వెల్లడించామని చెప్పారు. అయినప్పటికీ కొన్ని చోట్ల పోస్టర్లు, నినాదాలు దర్శనమిస్తున్నాయని, అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి రూ. పది వేల అపరాధ రుసుం విధించాలన్నారు. అలాగే నగరంలో విచ్చలవిడిగా తోపుడు బళ్లపై అమ్మకాలు సాగిస్తున్న వారి వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని జన సమ్మర్ధమైన ప్రాంతాలలో మార్జిన్ గీతలు దాటి తోపుడు బళ్లు పెట్టకుండా చూసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏసీపీ మధుసూదనరావు, టీపీఎస్ ఫిలిప్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

- ఆర్ఐఎన్ఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి కరుణరాజు


ఆర్ఐఎన్ఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి కరుణరాజు సన్మానిస్తున్న కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్, తదితరులు

డెంకాడ: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, దానిని సాధించేందుకు నిరంతరం పరితపించాలని ఆర్ఐఎన్ఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఎస్.కరుణరాజు అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కోసం కెరీర్ గైడెన్స్, ఏ వే ఆఫ్ లైఫ్ అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు దేశ పురోగతి, నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పుట్టుకతో ఎవరూ గొప్పవారు కారని, అంచెలంచెలగా మనల్ని మనం కాలానికి, పరిస్థితులకు తగ్గట్టు మలుచుకోవాలన్నారు. మార్పు ప్రకృతి స్వభావమని, ఆ మార్పును స్వీకరించి ముందుకు సాగినప్పుడే వికాసం సాధ్యమవుతుందని చెప్పారు. కర్నూల్ ఐఐటీడీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.వెంకటకృష్ణారావు మాట్లాడుతూ, యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి, దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. కళాశాల చైర్మన్ పి.మధుసూధనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, తదితరులు అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో పీడీ శైలజ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.